క్లుప్తంగా

ప్రయాణికుల భద్రతపై దృష్టిపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి, స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: రైల్వే ప్రయాణికుల భద్రతపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రతా అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైళ్ల వేగం పెరగడంతో ప్రయాణికులు గేట్ల వద్ద ఉండకుండా చూడాలన్నారు. టిక్కెట్ లేని వారిని ప్లాట్‌ఫాంపైకి రాకుండా చూడాలన్నారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుమానం ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేసేలా ఆర్పీఎఫ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి రైల్వే స్టేషన్ మేనేజర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఎస్ బి.శ్రీధర్, స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్ పాల్గొన్నారు.

బాధితుడికి వంగా గీత పరామర్శ



రామన్నపాలెంలో బాధితుడు శ్రీనును పరామర్శిస్తున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు రామన్నపాలెనికి చెందిన గెద్దం శ్రీను ఇటీవల ప్రమాదానికి గురై గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీత గురువారం శ్రీనును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, వైఎస్సార్ సీపీ నేతలు జ్యోతుల చక్రబ్బాయి, ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాసరావు, ఉమ్మిడి చిన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థికి డీఎస్పీ ఆర్థిక సాయం



యశ్వంత్‌కు ఆర్థిక సాయం చేస్తున్న డీఎస్పీ లతాకుమారి, సీఐ రవికుమార్

పెద్దాపురం: ఓ అనాథ విద్యార్థికి డీఎస్పీ లతాకుమారి అండగా నిలిచారు. పట్టణానికి చెందిన యశ్వంత్ తండ్రి కర్రి వెంకన్న చాన్నాళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి ఈశ్వరి యశ్వంత్‌ను స్థానిక ట్రినిటీ ప్రైవేట్ స్కూల్లో ఏడో తరగతి వరకు చదివిస్తుండగా ఇటీవల ఆమె కూడా మృతి చెందింది. దీంతో యశ్వంత్ విద్య మధ్యలోనే నిలిచిపోయింది. విషయాన్ని పట్టణ యువత వంగలపూడి సతీష్ ద్వారా తెలుసుకున్న డీఎస్పీ లతాకుమారి స్పందించి యశ్వంత్‌కు అవసరమైన రూ.13 వేల ఆర్థిక సాయాన్ని సీఐ రవికుమార్‌తో కలిసి అందజేశారు.

18 నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్యభాగ నదీ తీరంలో కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణ మూర్తి తెలిపారు. ఏటా ఉగాది తరువాత వచ్చే ఏకాదశి పర్వదినంలో స్వామి వారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 18న గరుడ వాహనంపై గ్రామోత్సవం, 19న స్వామి అమ్మవార్లకు మంగళస్నానాలు, అభిషేకాలు తదితర పూజలు, 24వ తేదీ రాత్రి స్వామి వారి శ్రీపుష్ప యోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తుని: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని స్థానిక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని ప్రశ్నించామన్నారు. బ్యాగులు తనిఖీ చేసి 18 కిలోల 390 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.92 వేలు ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా చెల్లగడ్డకు చెందిన సంజిత్ లిమ్మాను అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లో గంజాయిని అమ్మకోవడానికి తీసుకువెళ్తుండగా తుని వచ్చే సరికి అవతల వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వేరే వ్యక్తికి ఇవ్వడానికి తుని స్టేషన్‌లో దిగినట్టు నిందితుడు సంజిత్ లిమ్మా చెప్పాడన్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్సై గోవిందరావు, జీఆర్పీ సిబ్బంది పి.శ్రీనివాసరావు, మోహనరావు, ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావుతో కలిసి నిందితుడు సంజిత్ లిమ్మాను అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టుకు తరలించామన్నారు.

వేసవిలోనూ పవర్‌ఫుల్‌గా..

- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- పెరుగుతున్న విద్యుత్ వినియోగం



సామర్లకోట సంపెంగ తోటలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్



సామర్లకోటలోని విద్యుత్ సబ్ స్టేషన్

సామర్లకోట: వేసవి వచ్చిందంటే తాగునీటి ఎద్దడితో పాటు మరో ముఖ్యమైన సమస్య ఏర్పడేది విద్యుత్ సరఫరాతోనే. సహజంగానే ఈ కాలంలో సాధారణం కంటే రెట్టింపు విద్యుత్ వినియోగం పెరుగుతుంది. డిమాండ్‌కి తగ్గట్టు సరఫరా లేకపోవడం వల్ల సహజంగానే లో ఓల్టేజీ సమస్యలు, క్రమబద్ధమైన సరఫరా కాకుండా హెచ్చుతగ్గులతో ఉండడంతో అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోవడం లేదా, గృహోపకరణాలు కాలిపోవడం సంభవిస్తూ వినియోగదారులకు నష్టంచేస్తుంటాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అధికారులు అదనపు లోడ్‌కు అవసరమైన నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పాత వాటి స్థానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, కొత్త సబ్‌స్టేషన్లను నెలకొల్పడం చేస్తుంటారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలకు విద్యుత్ సరఫరా చేయడానికి జగ్గంపేట రోడ్డులోని పాండవుల మెట్ట ఎదురుగా, పెద్దాపురం పట్టణంలో ఏడీబీ రోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియా, మహారాణి కళాశాల, టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద సబ్ స్టేషన్లు ఉన్నాయి. పెద్దాపురం ప్రధాన సబ్ స్టేషన్ నుంచి సామర్లకోటలో పిఠాపురం రోడ్డులో ఉన్న సబ్ స్టేషన్‌కు సప్లయ్ వస్తుంది. అక్కడ విద్యుత్ నాణ్యతను పెంచి అక్కడి నుంచి జగనన్న కాలనీ, ఉప్పువారి సత్రం టిడ్కో ఇళ్లు, సామర్లకోట మండలం పరిధిలో వేట్లపాలెం, మాధవపట్నం గ్రామాల్లో మినీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా పెద్దాపురం మండల పరిధిలో ఆర్‌బీ పట్నం, దివిలి, ఆనూరుల్లో మినీ విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. ఆనూరు మిని సబ్ స్టేషన్‌లో విద్యుత్ నాణ్యత పెంచడానికి 5 ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆయా సబ్ స్టేషన్ల నుంచి పట్టణ, మండల పరిధిలో వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

సర్వీసులు అన్నింటికీ నాణ్యంగా..

నియోజకవర్గ పరిధిలో సుమారు 94 వేల గృహావసర, 12వేల వ్యాపార, 1200 వ్యవసాయ, 960 వరకు పారిశ్రామిక సర్వీసులు ఉన్నాయి. వేసవి దృష్ట్యా ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా వారందరికీ నాణ్యమైన విద్యుత్‌ను అధికారులు సరఫరా చేస్తున్నారు.

వేసవిలో సమస్యలు రాకుండా..



వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముందస్తుగానే సబ్‌స్టేషన్లలో మరమ్మతులు పూర్తిచేసి, రెండు మండలాల్లో 40 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. అధిక లోడు ఉన్నచోట్ల సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఏసీలను 26 డిగ్రీల్లో ఉంచుకుంటే అనవసర వినియోగాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

– రమేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, సామర్లకోట

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ మాజీ కౌన్సిలర్



పార్టీలో చేరిన వారితో దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: టీడీపీ మాజీ కౌన్సిలర్ ఊటా రాజు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఆయనతో పాటు, కొల్లి శ్రీనివాసులకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొర బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు మేలు జరగడంతో పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. దొరబాబు వారిని అభినందిస్తూ పార్టీ విజయానికి 40 రోజుల కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు నేతల హరిబాబు, చల్లపల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవిని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో శ్రీకుకాళం అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబును నియమించారు.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా



పొన్నాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పొన్నాడలో ఎన్నికల ప్రచారం



ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: నియోజకవర్గ ప్రజలకు కష్టం వస్తే తాను అండగా ఉంటానని, బాధితులను ఆదుకుంటానని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని పొన్నాడ ఒకటో వార్డు, గ్రామ శివారు పల్లిపేట, బ్రాహ్మణపేట, ఎస్సీపేటలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అవ్వాతాతలు, మహిళలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్లు అందించే వారని, ప్రతిపక్షాలు వారి సేవలను అడ్డుకోవడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తొలుత ఎస్సీపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ పొన్నాడలో స్థానికులు శ్మశానవాటిక సమస్యను ఆమె దృష్టికి తీసుకురాగా ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘాలతో వంగా గీత సమావేశం



గొల్లప్రోలులో వర్తకసంఘ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

గొల్లప్రోలు: పట్టణలోని వర్తక సంఘాల నాయకులతో వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత గురువారం సమావేశం నిర్వహించారు. పిఠాపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మొగిలి బాబ్జీ ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని మినప, వేరుశనగ వర్తక సంఘాలతో చర్చించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేరుశనగ వర్తక సంఘ అధ్యక్షుడు కొశిరెడ్డి సూరిబాబు, మినపప్పు వర్తక సంఘం అధ్యక్షులు జి.గంగబాబు పాల్గొన్నారు. అనంతరం గొల్లప్రోలులో పార్టీ కార్యకర్త కొశిరెడ్డి శ్రీనువాసు కుటుంబాన్ని పరామర్శించారు.

వాహనాల తనిఖీలో రూ.2.48 లక్షలు సీజ్



స్వాధీనం చేసుకున్న నగదుతో కమిషనర్ రామారావు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వాహనాల తనిఖీలో భాగంగా గురువారం సాయంత్రం సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్స్ సమీపంలో రెండు వాహనాల నుంచి రూ.2.48 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఒక వాహనంలో ఉన్న రూ.లక్ష మరో వాహనంలో రూ.1.48 లక్షలకు ఎటువంటి రసీదులు లేక పోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఏడీబీ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఈ మొత్తం లభించింది. సార్వత్రిక ఎన్నికల నిబంధనలను అనుసరించి రూ.50 వేలకు మించి నగదును తమ వెంట తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. పెళ్లిళ్ల బృందాలు, ఆస్పత్రులకు వెళ్లే వారు ఇబ్బంది లేకుండా ఆధారాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నగదును రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై మూర్తి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ కచ్చితంగా పాటించాలి

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు కోడ్‌ను కచ్చితంగా అనుసరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ కోరారు. సర్పవరం జంక్షన్‌లో ఆర్వో కార్యాలయం వద్ద గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ మోడల్ కోడ్ అమలుకు 7 బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అమలుకు 9 బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన నుంచి రాజకీయ పార్టీల అభ్యర్థులకు 26 అనుమతులు ఇచ్చామన్నారు. సివిజిల్ యాప్ ద్వారా 71 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ముఖ్యంగా 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదుకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో డీఎస్పీ కె.హనుమంతరావు, తహసీల్దార్ విజయ ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చలమలశెట్టి సునీల్, వంగా గీత

గొల్లప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని చెందుర్తిలో చెందిన 150 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఖండవల్లి మణికుమార్, పిల్లా బాబ్జీ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేస్తామని, చెందుర్తిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని వారు హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీ విజయానికి పాటుపడాలని చలమలశెట్టి సునీల్, వంగా గీత వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, సర్పంచ్ అల్లి పాప, వైస్ ఎంపీపీ బత్తిన మంగ, ఉపసర్పంచ్ కోనేటి సుధ, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుక్కా సుబ్బారావు, నాయకులు కొనేటి పెదకాపు, మొగలి బాబ్జీ, మొగలి అయ్యారావు, దాసం వేంకటేష్, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వస్తే మరింత సంక్షేమం



దివిలిలో ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

- ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు


పెద్దాపురం: రాష్ట్రంలో అమలుచేసిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని గుర్తించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తే మరింత సంక్షేమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గురువారం మండలంలోని దివిలిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులు నరాలశెట్టి త్రినాథ్, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ విజ్జపురెడ్డి రమేష్, ఎంపీటీసీ భద్రరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. దొరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోదఫా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి చీమదొర, గోలి రామారావు, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, కనపర్తి శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తి వ్యత్యాసంపై ప్రత్యేక దృష్టి

- ఆర్డీవో ఇట్ల కిశోర్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: లింగ వివక్ష చూపుతూ ఆడ శిశువులపై జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్డీఓ ఇట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఆయన కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డివిజనల్ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు చేసే పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అలా దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 111 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి, మార్చి రెండు నెలలకు 6 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 95 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. పిండ లింగనిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామస్థాయిలో వైద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతలపై అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.ఇందిరా శ్రీశైలజ, పిడియాట్రిషియన్ డాక్టర్ ఎం.కీర్తి ప్రియ, వి.వరలక్ష్మి, శివశక్తి ఎన్‌జీవో వి.అనిత, కారుణ్య చారిటబుల్ ట్రస్ట్ ఎన్‌జీవో కె.సింహాద్రి, యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఎన్‌జీవో, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎస్.అజయ్, సీడీపీవోలు సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, వి మాధవి, కె.కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్స్ జి.రాంబాబు, కె.గోవింద్, ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



సామర్లకోట సచివాలయంలో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు



కాండ్రకోటలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీఓ ఉషారాణి



ఉప్పాడ గ్రామ సచివాలయంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న దృశ్యం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ జె. రామారావు, మండల పరిధిలో ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ పరిశీలించారు. గురువారం సాయంత్రానికి 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. దివ్యాంగులు, బయటకు రాలేని వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు వారు తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 15 సచివాలయాలు, మండల పరిధిలో 23 సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఈ నెల ఆరో తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులు ఆయా సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సెలవు దినం అయినా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

80 శాతం పింఛన్ల పంపిణీ

పెద్దాపురం: మండలంలోని లబ్ధిదారులకు రెండు రోజుల పాటు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. అన్ని పంచాయతీల వద్ద పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ సమర్థంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండో రోజుకు సుమారు 80 శాతం పంపిణీ పూర్తి చేసినట్టు తెలిపారు. మండలంలో సుమారు 11,962 మందికి గాను 9,646 మందికి పింఛన్లు అందజేసినట్టు ఆమె తెలిపారు. అనంతరం కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో కొంతమంది లబ్ధిదారులకు ఆమె పింఛన్లు పంపిణీ చేశారు.

65 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

కొత్తపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరం కావడంతో గ్రామ సచివాలయాల్లో అధికారులు పింఛన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 12,901 మంది పింఛనుదారులు ఉండగా ఇప్పటివరకూ 8,333 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. పింఛనుదారులకు ఎంటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సచివాలయాల వద్ద టెంట్లు వేసి, మంచి నీటి వసతి కల్పించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

గొల్లప్రోలు: పట్టణ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలో ఇప్పటివరకూ 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు నగర పంచాయతీ కమిషనర్ టి.రవికుమార్ తెలిపారు. సచివాలయాల్లో వికలాంగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. గొల్లప్రోలు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల వద్ద అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా సచివాలయాల్లో తాగునీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు తెలిపారు.